క్లుప్తంగా

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ, ఎంపీడీఓ

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని బుగ్గమాదారం కృష్ణానది పుష్కరఘాట్ వద్ద గణేష్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను మండల తహసీల్దార్ సురేందర్ రెడ్డి, ఎస్‌ఐ సైదిరెడ్డి, ఎంపీడీఓ భూపాల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ చేయాల్సిన పనులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. క్రేన్ తదితర ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట స్థానిక అధికారులు సిబ్బంది ఉన్నారు.

పంట నష్టం వివరాల నమోదు



వివరాలు నమోదు చేసుకుంటున్న ఏడీఏ రవి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని వజినేపల్లి, బుగ్గమాదారం గ్రామాలలో వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పంటలను మంగళవారం ఏడీఏ రమావత్ రవి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన పంట నష్టం, పరిహారం వివరాలను ఆయన నమోదు చేసుకున్నారు. ఆయన వెంట ఏఓ శశాంక్, ఏఈఓ దుర్గాభవాని, రైతులు ఉన్నారు.

వర్షాలకు కూలిన ఇళ్ల సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

మఠంపల్లి : మండలంలో కురిసిన భారీ వర్షాలకు రఘునాథపాలెం గ్రామంలో కూలిపోయిన ఇళ్లను మంగళవారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానీభాషా, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్ పరిశీలించి సర్వే చేశారు. వారి వెంట జేపీ మట్టయ్య, మాకం నరసింహారావు, గ్రామస్తులు తదితరులున్నారు.

వరద బాధితులకు వస్త్ర వ్యాపారుల వితరణ



సేకరించిన వస్త్రాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందిస్తున్న మల్లారెడ్డి

కోదాడ : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద ముంపునకు గురైన బాధితులను ఆదుకోవడానికి కోదాడ వస్త్రవ్యాపారుల సంఘం ముందుకు వచ్చింది. కోదాడ ఎమ్మెల్యే పిలుపు మేరకు క్లాత్ మర్చంట్స్ జిల్లా కార్యదర్శి భూసాని మల్లారెడ్డి ఆధ్వర్యంలో వస్త్ర వ్యాపారులు తమ దుకాణాలలోని వివిధ రకాల నూతన వస్త్రాలను భారీగా సేకరించారు. వాటిని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, గంజి పిచ్చయ్య, రామినేని భాస్కర్, వంగవీటి కిరణ్, జూకూరి అంజయ్య నాయకులు కందుల కోటేశ్వరరావు, చిత్తలూరి శివ, ముస్తాఫ, గోపి, రవి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సహకారం

మఠంపల్లి : మండలంలోని ఎన్‌సీఎల్ (నాగార్జున సిమెంట్ లిమిటెడ్) పరిశ్రమ ఆధ్వర్యంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌లోని వరద బాధితులకు సుమారు రూ.84వేల విలువ గల దుస్తులు, మందులు పంపించారు. ఈ సందర్భంగా స్థానికంగా పరిశ్రమ సీఎంఓ డాక్టర్ శ్రీహరిరావు మాట్లాడారు. వరదల కారణంగా నష్టపోయిన విజయవాడ బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కలిసి సంయుక్తంగా ఎన్‌సీఎల్ ప్రెసిడెంట్ చక్రధర్ నేతృత్వంలో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అధికారులు మంజుల, ఆదిలింగం తదితర సంబంధిత ప్రతినిధుల సమక్షంలో వస్త్రాలు, మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ అధికారులు దస్తగిరిరెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఇరుగు కోటేశ్వరి, పూర్ణచందర్‌రావు తదితరులున్నారు.

వాగు ఒడ్డున మొసలి ప్రత్యక్షం



హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురం శివారులోని వాగులో మంగళవారం మొసలి ప్రత్యక్షమైంది. స్థానికులు మొసలిని గమనించి వీడియో తీసి వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడంతో వైరల్‌గా అయ్యింది. ఇటీవల కురిసిన వర్షాలకు మొసళ్లు కృష్ణానది ఒడ్డున, పరిసర వాగుల్లో దర్శనమిస్తున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

కోదాడ: నిరంకుశపాలనపై తిరుగుబాటు చేసిన చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. మంగళవారం ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూమికోసం భుక్తికోసం వెట్టిచాకరి విముక్తి కోసం ఆమె పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, లక్ష్మీనారాయణరెడ్డి, పారా సీతయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

పీడిత ప్రజల విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటాలు మరువలేనివని సీపీఎం నాయకులు అన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేదర మెట్ల వెంకటేశ్వరరావు, మిట్టగడుపుల ముత్యాలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర మహాసభ స్ఫూర్తితో కదం తొక్కిన మహిళ ఐలమ్మ

హుజూర్‌నగర్ : ఆంధ్ర మహాసభ స్ఫూర్తితో కదం తొక్కిన మొట్టమొదటి మహిళ చిట్యాల (చాకలి) ఐలమ్మ అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొరలు గడీల నుంచి ఉరికించిన వీరవనిత ఐలమ్మ అని అన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో నిరంతరం పేదల పక్షాన పోరాడుదామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇందిరాల త్రివేణి, నాయకులు దుగ్గి బ్రహ్మం, యోన, వీరమల్లు, వెంకటరెడ్డి, సోమయ్య, వెంకన్న, వీరబాబు, వీరస్వామి, శంభయ్య తదితరులు పాల్గొన్నారు.



కోదాడ : ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి



హుజూర్‌నగర్ : ఐలమ్మ చిత్రపటం వద్ద జోహార్లు అర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : దొరలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం చింతలపాలెం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలవేసి జోహార్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పేదల కోసం, కష్టజీవుల కోసం, భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఐలమ్మ పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వట్టేపు సైదులు, సుందర మాహేశ్వరరెడ్డి, పుల్లయ్య, జానమియా, వెంకన్న, పూర్ణయ్య, జంగల్మియా, శీను, భాస్కర్‌రెడ్డి, గోవిందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సైదులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా నాయకులు గూడెపు నాగలింగం, ఉపేందర్, అంజయ్య, చంద్రయ్య, రామస్వామి, వీరబాబు, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం రజక సంఘం, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ధనుంజయ నాయుడు, కొదమగుండ్ల నగేష్, చిలకరాజు శ్రీను, వెంకట్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, రాపోలు నవీన్, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, సింహాద్రి, వెంకన్న, రామస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నాగార్జున, లక్ష్మి, పావని, నాగమణి, రేష్మా, సంధ్య, సత్తెమ్మ, మరియమ్మ, మల్లేశ్వరీ, రమణ, నాగేంద్ర, దుర్గమ్మ, సావిత్రి తదితరులున్నారు.

మఠంపల్లి : మండలంలోని పెదవీడు గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దుగ్గి సైదులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ ఆశయ సాధనకు రజకులంతా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజా, సీతారావిరెడ్డి, సోమశేఖర్, శ్రీకాంత్, వీరబాబు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం వద్ద మంగళవారం రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకుడు కొరట్ల శ్రీనివాస్, జిల్లా నాయకుడు ముస్కు వీరస్వామి, నాయకులు కొరట్ల ప్రసాద్, రెడ్డిపల్లి లింగయ్య, కొరట్ల సాయిలు, రెంటాల శ్రీను, సుధాకర్‌రెడ్డి, అంతిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

గరిడేపల్లి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రజక సంఘం నాయకులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కీతవారిగూడెంలో ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం నిర్వహించిన పోరాటం ఐలమ్మతోనే ప్రారంభమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ముత్తయ్య, అంజయ్య, గూడెపు వెంకటేశ్వర్లు, సూరయ్య, జంగయ్య పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ రూరల్ : ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్, తదితరులు



నేరేడుచర్ల : చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



నడిగూడెంలో నివాళులర్పిస్తున్న నాయకులు



గరిడేపల్లి : నివాళులర్పిస్తున్న నాయకులు



కోదాడ : ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



మఠంపల్లి : పెదవీడులో..

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రజితారెడ్డి

మేళ్లచెరువు : గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోదాడ సీఐ రజితారెడ్డి కోరారు. మండల కేంద్రంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన గణేష్ ఉత్సవాల శాంతి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గణపతి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనానికి డీజేలకు అనుమతి లేదన్నారు. నిమజ్జన ర్యాలీల్లో గొడవలు లేకుండా భక్తిభావంతో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఎస్‌ఐ పరమేష్, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెరువు అలుగుకు గండి పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు



వృథాగా పోతున్న చెరువులోని నీరు

మునగాల : మండల కేంద్రంలోని చెరువు అలుగుకు సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గండిపెట్టారు. దీంతో నిండుకుండలా ఉన్న చెరువులో నీరు వృథాగా దిగువకు వెళ్తుంది. ఈ సందర్భంగా గండి ప్రాంతాన్ని మత్స్యకార సంఘం అధ్యక్షుడు పిట్టల శ్రీను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. మునగాల చెరువుకు వరదనీరు చేరి పూర్తిస్థాయిలో నిండిందన్నారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు అలుగుకు గండిపెట్టి తొలగించేందుకు ప్రయత్నించారన్నారు. గండి భారీగా పెడితే చెరువు కింద వందల ఎకరాల పొలాలు నీట మునిగే ప్రమాదం ఉందన్నారు. సమాచారం అందుకున్న అధికారులు గండిని తాత్కాలికంగా పూడ్చివేశారు. సంబంధిత అధికారులు విచారణ జరిపి, గండిపెట్టిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు అధికారులను కోరారు.

కరపత్రాల విడుదల

హుజూర్‌నగర్ రూరల్ : సూర్యాపేట పట్టణంలో నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని వేపలసింగారం గ్రామంలో అమరవీరుడు కామళ్ల జాను స్థూపం వద్ద ఆ పార్టీ నాయకులతో కలిసి వారోత్సవాల కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు.

నష్టపోయిన రైతులకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే నలమాద పద్మావతి

మోతె : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే నలమాద పద్మావతి భరోసా కల్పించారు. మంగళవారం మండల పరిధిలోని నామవరం, సిరికొండ, కూడలి, రంగాపురంతండా గ్రామాలలో ఆమె పర్యటించారు. వరదలతో నష్టపోయిన పంటల పొలాలు, వరదలతో కోతకు కొట్టుకపోయిన రోడ్లు, బ్రిడ్జీలు, చెరువులకు పడిన గండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మండలంలో పంట పొలాలు వరదపాలు కావడం చాలా బాధగా ఉందన్నారు. రైతుల శ్రమ, సాగు చేసిన పంటలు గంగపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ధ్వంమైన పంటలు, రోడ్లు, బ్రిడ్జీల అంచనాల నివేదికలు తమకు వెంటనే అందజేయాలని మండల వ్యవసాయ, పంచాయతీ రాజు, ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. పాక్షికంగా, పూర్తిగా కూలిపోయిన ఇళ్ల వివరాలు తమకు అందజేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. సంబంధిత మండల స్థాయి అధికారులు ప్రజలకు అండగా ఉండి ఆదుకోవాలన్నారు. అనంతరం పలు గ్రామాల్లో వినాయక మండపాల పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట మండల ప్రత్యేకధికారి సీతారాంనాయక్, తహసీల్దార్ సంఘమిత్ర, ఎంపీడీఓ ఆంజనేయులు, ఏఈ అరుణ, పీఆర్ ఏఈ రంగారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆశా, మాజీ జెడ్పీటీసీ పుల్లారావు, రైతులు ఉన్నారు.



మోతె : నామవరంలో ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

వర్షం బాధితులకు ప్రభుత్వం అండ

చిలుకూరు : వర్షం బాధితులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుని అండగా ఉంటుందని ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. మండలంలోని నారాయణపురంలో వర్షం బాధితులకు ఏర్పాటు చేస్తున్న వసతులను మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఇళ్లు కోల్పోయిన వారికి తాత్కాలికంగా రేకులతో వసతిగృహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇళ్లు కోల్పోయిన ప్రతిఒక్కరికి ఈ మోడల్ ఇళ్లు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు తరువాత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, ఆర్ఐ సీతయ్య, శ్వేత, ఇరిగేషన్ డీఈ, ఏఈలు స్వప్న, మానస, ఏఓ శ్రీధర్, గ్రామ కార్యదర్శి కవిత, మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురువులకు పూర్వ విద్యార్థుల ఘన సత్కారం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1987–88విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం 'గురు ప్రదక్షిణ' పేరుతో ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుడు పోరెడ్డి శ్రీరాంరెడ్డిని ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ పాఠశాలకు పూర్వ విద్యార్థులు స్ఫూర్తిదాయకమని ప్రస్తుత పాఠశాల హెచ్ఎం, పూర్వ విద్యార్థి బట్టు మధు, పాఠశాల పూర్వ విద్యార్థిని, మాజీ మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, అలక సైదిరెడ్డి, పి.లూకాస్, పోరెడ్డి లింగారెడ్డి, రమేష్, భిక్షారెడ్డి, సత్యం, సైదయ్య పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేయాలి

హుజూర్‌నగర్ : వరదలతో స్థానిక పీఏసీఎస్‌కు జరిగిన నష్టానికి ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని హుజూర్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ జక్కుల నరేందర్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం తహసీల్దార్, వ్యవసాయ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వరదలతో పీఏసీఎస్ గోడౌన్‌లోకి రెండు అడుగుల మేర నీరు చేరిందని, దీంతో గోడౌన్‌లో నిల్వ ఉన్న డీఏపీ, యూరియా, పొటాష్ బస్తాలు నీటిలో కరిగిపోయి దాదాపు రూ.7లక్షల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. నష్టం వివరాలను అధికారులకు వివరించి ప్రభుత్వం ద్వారా సహాయం చేయాలని కోరారు. అంతకు ముందు పీఏసీఎస్ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ కె.మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు మల్లీశ్వరి, మలమ్మ, శ్రీనివాస్, శ్రీను, బ్రహ్మం, శ్యామ్‌సుందర్, పద్మ, రాయల వెంకటేశ్వర్లు, సెక్రటరీ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరిలో నత్రజని వాడకం తగ్గించాలి

నడిగూడెం : ప్రస్తుత సీజన్‌లో వరిపంటలో నత్రజని వాడకాన్ని తగ్గించాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి ఆర్.దేవప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 20రోజుల నుంచి వాతావరణంలో మార్పుల కారణంగా భారీ వర్షాలు కురిసాయని, దీంతో వరి పొలాలు గాలిలో నత్రజనిని గ్రహించి ఏపుగా పెరుగుతున్నాయన్నారు. ఈ దశలో రైతులు ఎలాంటి రసాయన ఎరువైన యూరియా వాడవద్దన్నారు. ఒకవేళ వాడితే చీడ, పీడల సమస్య పెరుగుతుందని, పంట దిగుబడి కూడా తగ్గే అవకాశముందన్నారు. రైతులు ఎప్పటికప్పుడు పొలాలను పరిశీలించి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

పెట్రోల్‌లో నీళ్లు వస్తున్నాయని ఆందోళన

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రంలోని ఓ బంకులో పెట్రోల్ కొట్టిస్తే పెట్రోల్‌తో పాటు నీళ్లు వచ్చాయని వినియోగదారులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ విషయమై బంకు సిబ్బందిని నిలదీశారు. బాటిల్లో పెట్రోల్ పట్టి చూడగా నీళ్లు కనిపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బంకు వారు కొద్ది సేపు బంకును మూసివేశారు. ఈ విషయమై వారిని వివరణ కోరగా పెట్రోల్ డెన్సిటీ సరిగానే ఉందని తెలిపారు. కావాలనే కొందరు గొడవ చేస్తున్నారని తెలిపారు. అవసరమైతే, అనుమానం ఉంటే చెక్ చేసుకోవచ్చని వారు వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మఠంపల్లి : విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న కార్మికుల (ఆర్టిజన్స్) సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రస్‌మియా కోరారు. ఈ సందర్భంగా మండలంలోని రఘునాథపాలెంలో సబ్‌స్టేషన్ ఆపరేటర్ వాసుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీఐటీయూ అనుబంధ విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని తెలిపారు.

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

మఠంపల్లి : మండలంలోని సిమెంట్ పరిశ్రమలలో 20ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికుల సర్వీస్‌లను రెగ్యులరైజ్ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని మట్టపల్లిలో జరిగిన సీపీఎం గ్రామ శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో కురిసిన వర్షాలకు నీట మునిగిన పంట పొలాలకు, కూలిన ఇళ్లకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో గ్రామ కార్యదర్శి జి.నరసింహారావు, మండల కార్యదర్శి బాలునాయక్, రాము, నాగమణి, లింగయ్య ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది



గరిడేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేవతి



నేరేడుచర్ల : అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

గరిడేపల్లి : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేవతి అన్నారు. మండల పరిధిలోని కీతవారిగూడెం అంగన్‌వాడీ సెంటర్–2లో మంగళవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మాతా శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తుందన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో పిల్లలు ఆరోగ్యంగా ఉండటంతో పాటు రోగ నిరోధక శక్తి పెంపొందించుకోవచ్చునని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ మల్లమ్మ, సైదమ్మ, నారాయణమ్మ, హెచ్ఎం ఉమా, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–4లో పోషణ్ మాసోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని అవగాహన కల్పించారు. పోషక విలువలు కలిగిన ఆహారంతో పాటు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జయమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వినాయక నవరాత్రోత్సవాలు



నేరేడుచర్ల : వినాయక విగ్రహం వద్ద హోమంలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం పట్టణంలోని వినాయక విగ్రహం వద్ద కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో సీఐ చరమందరాజు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, మున్సిపల్ వైస్‌చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, కౌన్సిలర్లు, నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం

నేరేడుచర్ల : మండల కేంద్రంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా స్థానిక ఎస్ఆర్‌కె అపార్ట్‌మెంట్‌లో మంగళవారం మిర్యాలగూడ ఆర్య సమాజ నిర్వాహకులు గుంటూరు ఈశ్వరమ్మ, గుడిపాటి అనిత, చిల్లంచర్ల అనురాధ, వెంపటి సునీతల ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. హోమంలో ఉత్సవ, అపార్ట్‌మెంట్ కమిటీ అధ్యక్షులు కొత్త లక్ష్మణ్, భువనగిరి అంజయ్య, అరిబండి కిరణ్‌కుమార్, కందిబండ హరిప్రసాద్, ఈగ శ్రీనివాస్‌రావు, రాచకొండ శ్రీనివాస్‌రావు, సుంకరి క్రాంతికుమార్, రోశయ్య, రాంబాబు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : వినాయకుడిని మండపం వద్ద దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు